కేసుల దర్యాప్తులో రాజీపడొద్దు

పెండింగ్ కేసులలో వేగం పెంచండి: ఏసీబీ డీజీ

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): అవినీతి కేసులలో పట్టుడిన వారిని చట్టం ముందు నిలబెట్టడంలో దర్యాప్తు అధికారులు రాజీపడొద్దని ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ స్పష్టంచేశారు. చాలాకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని చెప్పారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి మే చివరి వరకు 112 కేసులను నమోదు చేసి, ప్రభుత్వానికి తుది నివేదికలు సమర్పించామని వెల్లడించారు. మే నెలలో మొత్తం 19 కేసులు నమోదు చేశామని, 25 మంది ప్రభుత్వ ఉద్యోగులను అరెస్ట్ చేసి, రూ.3,63,000 నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఆదిలాబాద్ రేంజ్‌లోని మంచిర్యాలలో కొత్తగా ఏర్పాటు చేసిన ఏసీబీ కార్యాలయం చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు ఉపయోగకరంగా ఉందని తెలిపారు. సమావేశంలో ఏసీబీ డైరెక్టర్ తరుణ్‌జోషి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ కోసం ఏఐ సాఫ్ట్‌వేర్

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): దేశంలో మొట్టమొదటి ఏఐ ఆధారిత ఫైర్ డ్రాయింగ్ స్క్రూటినీ సిస్టమ్, ఫైర్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సోమవారం హైదరాబాద్‌లోని అగ్నిమాపక శాఖ కేంద్ర కార్యాలయంలో ప్రారంభించారు. ఈ వ్యవస్థతో భవన ఫైర్, లైఫ్ సేఫ్టీ డ్రాయింగ్‌లను ఆటోమోటెడ్‌గా పరిశీలించడం ద్వారా అగ్నిప్రమాదాల నిరోధానికి కీలకంగా మారనున్నదని డీజీ నాగిరెడ్డి తెలిపారు. కొత్త భవనాలకు అనుమతి ఇచ్చే సమాయం, మానవీయ పొరపాట్లు తగ్గుతాయని, బిల్డింగ్ డ్రాయింగ్‌ల సమర్పణలో ఒకే విధమైన ప్రామాణికత పాటించవచ్చని, అన్ని ఫైళ్లను సమాన ప్రాధాన్యతతో ఒకేసారి ఏఐ సాఫ్ట్‌వేర్ పరిశీలిస్తుందని వెల్లడించారు. పోలీస్, జీహెచ్‌ఎంసీ, విద్యుత్తు, నీటి సరఫరా వంటి శాఖలతో సమన్వయం చేసుకుంటూ వేగంగా స్పందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణకు బీఆర్ఎస్ రక్షణ కవచం

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం చరిత్రాత్మకం

- కేసీఆర్‌తోనే నాడు స్వరాష్ట్ర కల సాకారం
- పదేండ్లలో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిన నేత
- మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి
- తెలంగాణ భవన్‌లో ఘనంగా అవతరణ వేడుకలు
- ఉద్యమం, కేసీఆర్ ఘనతను చాటిచెప్పిన నేతలు

తెలంగాణ భవన్‌లో రాష్ట్రావతరణ వేడుకల్లో పాల్గొన్న మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబిత, మాజీ ఎంపీ వినోద్‌కుమార్

హైదరాబాద్ జూన్ 2 (నమస్తేతెలంగాణ): ఈనాడైనా మరేనాడైన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీయే తెలంగాణకు రక్షణ కవచమని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఉద్ఘాటించారు. కేసీఆర్ ఆత్మవిశ్వాసంతో సాగించిన అసమాన పోరాటంతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని చెప్పారు. ఉద్యమనేతగా, పాలనాదక్షుడిగా నాలుగుకోట్ల ప్రజల హృదయాల్లో కొలువుదీరిన గొప్పవ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సోమవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, విప్ కేపీ వివేకానంద ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలవేశారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. చరిత్రలో జూన్ 2 సువర్ణాక్షరాలతో లిఖించిన రోజని.. ఇందుకు కర్త, కర్మ, క్రియ కేసీఆరేనని స్పష్టం చేశారు. అన్నివర్గాలను కలుపుకొని తెలంగాణను సాధించిన కేసీఆర్.. పాలనాదక్షతతో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. తెలంగాణ వనరులు, ప్రజల అవసరాలపై సంపూర్ణ అవగాహన ఉన్న నాయకుడు కేసీఆరేనని స్పష్టంచేశారు. జై తెలంగాణ నినాదమే ఆయుధంగా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లి స్వరాష్ట్ర కలను నిజం చేశారని పేర్కొన్నారు. అద్భుత వ్యూహరచన ఆయన సొంతమని మధుసూదనాచారి ప్రశంసించారు. అలవికానీ హామీలిచ్చి..100 రోజుల్లోనే అమలు చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పతనం.. అప్పుడే ప్రారంభమైందని విమర్శించారు. ఆరు నెలల్లోనే తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ప్రభుత్వం దేశంలో ఇదేనని చెప్పారు. ఈ తరుణంలో ప్రజలు మళ్లీ కేసీఆర్‌వైపు చూస్తున్నారని తెలిపారు.

కేసీఆర్ ఆలోచనాతోనే రాష్ట్రం: వినోద్

కేసీఆర్ ఆలోచనా విధానంతోనే తెలంగాణ కల సాకారమైందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-3ని ఆకలింపు చేసుకొని ప్రజాస్వామిక పంథాలో 32 రాజకీయ పార్టీలను ఒప్పించి రాష్ట్రాన్ని తీసుకొచ్చామని తెలిపారు. 2014లో పురుడు పోసుకున్న తెలంగాణ బిడ్డ కేసీఆర్ నాయకత్వంలో అన్నింటా ముందు నిలిచిందని కొనియాడారు. ప్రస్తుతం దురదృష్టవశాత్తు రాష్ట్రం దుర్మార్గుల చేతుల్లో చిక్కుకున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. మళ్లీ మనం అప్రమత్తం కావాల్సిన తరుణం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. కేసీఆర్ పాలనను తిరిగి తెచ్చుకోవాల్సిన చారిత్రక అవసరమున్నదని నొక్కిచెప్పారు. ఇందుకోసం పార్టీ శ్రేణులు నిర్విరామంగా శ్రమించాలని ఉద్బోధించారు.

అమరుల త్యాగఫలమే తెలంగాణ: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ సిద్ధించిందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. కేసీఆర్ ఆలోచనా విధానంతో రూపుదిద్దుకున్న రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని చెప్పారు. తెలంగాణ కోసం ఉస్మానియా గడ్డపై సిరిపురం యాదయ్య, ఇషాన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి త్యాగాలకు తాను ప్రత్యక్ష్య సాక్షినని చెప్పారు. కేసీఆర్ ఏర్పాటుచేసిన గురుకులాల్లో వారి పిల్లలను చదివించే అదృష్టాన్ని, కేసీఆర్ కట్టిన సెక్రటేరియట్ ముందు నిలిచే భాగ్యాన్ని, కేసీఆర్ స్థాపించిన మెడికల్ కాలేజీలో చదువుకొనే అవకాశాలను, ప్రపంచ ఇంజినీరింగ్ అద్భుతం కాళేశ్వరం ప్రాజెక్టును, ఆ నీళ్ల ద్వారా మొలకెత్తిన విత్తనాలను తినే అవకాశాలను కోల్పోయిన అమరులు మనకు అదృష్టాన్ని ఇచ్చి వెళ్లిపోయారని ఉద్ఘాటించారు.

కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయం: మాజీ మంత్రి మల్లారెడ్డి

పన్నెండేండ్ల క్రితం ఆవిర్భవించి.. కేసీఆర్ నాయకత్వంలో అద్భుతంగా రూపుదిద్దుకున్న తెలంగాణ ఇప్పుడు కౌరవుల చేతిలో బందీగా మారిందని మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ సర్కారు దురాగాతాలతో ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని చెప్పారు. రాబోయే మూడేండ్లలో తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఇందుకోసం పార్టీ నాయకులు అలుపెరగని కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ పేరు చిరస్థాయిగా నిలబడతది: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయాలని కొందరు కుట్రలు చేస్తున్నారని, కానీ, సూర్యచంద్రులు ఉన్నంతకాలం కేసీఆర్ గురుతులను వారు తొలగించలేరని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తేల్చి చెప్పారు. ఆయన నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని అభివర్ణించారు. కేసీఆర్ మళ్లీ తిరిగి ముఖ్యమంత్రి కావడం.. ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందడం ఖాయమని మైనార్టీ నాయకుడు సలీం ధీమా వ్యక్తంచేశారు. ఓ సిద్ధాంతం, ఆశయం కోసం తపిస్తున్న కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, మాధవరం కృష్ణారావు, బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు రవీందర్‌రావు, దాసోజు శ్రవణ్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, వై సతీశ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, తులఉమ, దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్, నేతలు శుభప్రద్ పటేల్, కిశోర్ గౌడ్, సుమిత్రా ఆనంద్‌తనోబా, గజ్జెల నగేశ్, బాలరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అసమర్థుల చేతుల్లోకి తెలంగాణ: వాణీదేవి

కేసీఆర్ పాలనలో నాడు దేశానికే దిక్సూచిగా నిలిచి తెలంగాణ రాష్ట్రం.. ఇప్పుడు దురదృష్టవశాత్తు అసమర్థుల చేతుల్లోకి వెళ్లిందని ఎమ్మెల్సీ వాణీదేవి ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన యువకులు, మహిళలకు ఆమె జోహార్లు అర్పించారు. 1969 పోరాటం విఫలమైన పరిస్థితుల్లో ఇక తెలంగాణ రాదేమోనని నిరాశకు గురయ్యామన్నారు. కానీ కేసీఆర్ అసమాన పోరాటంతో రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. మనమందరం మొక్కవోని దీక్షతో ముందుకు సాగి తిరిగి తెలంగాణను అభివృద్ధి చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు.

మిన్నంటిన జై తెలంగాణ నినాదాలు

తెలంగాణ భవన్‌లో రాష్ట్రావిర్భావ సంబురాలు సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో భవన్ ప్రాంగణం ప్రతిధ్వనించింది. పార్టీ కార్యాలయాన్ని గులాబీ తోరణాలతో అలంకరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి గులాబీ శ్రేణులు తరలివచ్చాయి. డప్పు చప్పుళ్ల నడుమ తెలంగాణ సంప్రదాయ నృత్యాలతో ర్యాలీలుగా తరలివచ్చారు. భవనం ప్రాంగణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. పలువురు నాయకులు స్వీట్లు పంచిపెట్టారు. కళాకారులు ఆటపాటలతో అలరించారు. ర్యాలీని అనుసరించిన గుర్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ భవన్‌లో కార్యకర్తల నడుమ భారీ కేక్ కట్ చేశారు.

11న కాళేశ్వరం విచారణకు కేసీఆర్

కమిషన్ విచారణ తేదీ మార్పు

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం కమిషన్ ఎదుట బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుకానున్న తేదీ మారింది. వాస్తవానికి ఈ నెల 5న విచారణకు రావాల్సిందిగా కేసీఆర్‌ను జస్టిస్ ఘోష్ కమిషన్ ఆహ్వానించింది. అయితే, 5వ తేదీన కాకుండా 11వ తేదీన హాజరవుతానంటూ కేసీఆర్ లేఖ రాయడంతో, కమిషన్ అందుకు అంగీకారం తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌కు కూడా నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. వారిద్దరు ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే ఈ నెల 6, 9 తేదీల్లో విచారణకు హాజరయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇక కాళేశ్వరం కమిషన్ విచారణ ఇప్పటికే తుది దశకు చేరుకున్నది. ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లు, డిజైన్స్, డీపీఆర్, నిర్మాణ సంస్థల ప్రతినిధులను కమిషన్ విచారించింది. కాగ్ అధికారులను సైతం పలు అంశాలపై ప్రశ్నించింది. విజిలెన్స్, ఎన్‌డీఎస్‌ఏ నివేదికలను సైతం అధ్యయనం చేసింది. ఆయా అంశాలన్నింటినీ క్రోడీకరించి దాదాపు 400 పేజీలతో నివేదిక తయారుచేసినట్టు సమాచారం. విచారణలో భాగంగా చివరగా రాజకీయ ప్రముఖుల అభిప్రాయాన్ని కూడా తీసుకోవాలని నిర్ణయించింది. ఈ క్రమంలో నోటీసులు జారీ చేసింది. విచారణ అనంతరం ప్రభుత్వానికి తుది నివేదికను సమర్పించనున్నట్టు కమిషన్‌వర్గాలు చెప్తున్నాయి.

హైకోర్టులో రాష్ట్రావతరణ వేడుకల్లో పాల్గొన్న యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్

హైకోర్టులో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం హైకోర్టులోయాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు హాజరయ్యారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా గత పదేండ్లు జరిగిన కార్యక్రమాల్లో హైకోర్టు చీఫ్ జస్టిస్‌లు ప్రసంగించారు. కానీ, ఈసారి మాత్రం యాక్టింగ్ సీజే ప్రసంగించకుండా జాతీయ పతాక ఆవిష్కరణతో ముగించారు.

దేశ పురోగతికి తెలంగాణ అవిరళ కృషి

- రాష్ట్రావతరణ దినోత్సవ వేళ ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన
- తెలంగాణ ఉద్యమమే జనసేనకు స్ఫూర్తి: పవన్

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): దేశ పురోగతికి తెలంగాణ అవిరళ కృషి చేస్తున్నదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా తెలుగులో ట్వీట్ చేశారు. రాష్ట్ర ప్రజలకు విజయాలు, సంపదలు కలిగేలా ఆశీర్వాదాలు లభించాలని అన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. 'జనసేనకు జన్మనిచ్చిన నేల, నాకు పునర్జన్మను ఇచ్చిన నేల, నాలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన నేల, నా తెలంగాణ కోటి రతనాల వీణ అని తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో తలకిందులుగా ఎగురవేసిన జాతీయ జెండా

దేవరకద్రలో జాతీయ జెండాకు అవమానం

- తలకిందులా ఎగురేసిన కాంగ్రెస్ నాయకులు
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

దేవరకద్ర, జూన్ 2 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేసి అవమానించారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ దగ్గర జాతీయ జెండాను పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌ఫారుక్ అలీ జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేశారు. గమనించిన నాయకులు వెంటనే జాతీయ జెండాను సరిచేశారు. జాతీయ జెండాను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సోనియా ఫొటోకు దండేసిన కాంగ్రెస్ నేతలు

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలో తలవంపులు

రామగిరి, జూన్ 2 : పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీకాలనీలో సోమవారం జరిగిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహంతో పార్టీ అధినేత సోనియాగాంధీ చిత్రపటానికి దండ వేసి వందనం చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ఘటనపై నెటిజన్లు మండిపడుతున్నారు. కాంగ్రెస్ నేతలకు కనీస అవగాహన లేదని విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ నాయకుల అత్యుత్సాహం బెడిసికొట్టడం మండలంలో చర్చనీయాంశమైంది.

రామగిరిలో సోనియాగాంధీ చిత్రపటానికి దండేసి వందనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

తెలంగాణ రాష్ట్రావతరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్ కాళ్లు మొక్కుతున్న అమరవీరుడి కుటుంబానికి చెందిన మహిళ

అవతరణ దినోత్సవం సాక్షిగా

ఎమ్మెల్యేకు అమరవీరుల కుటుంబాల పాదాభివందనం

రంగారెడ్డి, జూన్ 2 (నమస్తేతెలంగాణ) : తెలంగాణ అమరవీరుల కుటుంబాలు కాంగ్రెస్ నాయకుల పాదాలు పట్టే పరిస్థితి వచ్చింది. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఎక్లాస్‌పేట్‌కు ప్రేమ్‌రాజ్ రాష్ట్ర సాధనలో భాగంగా ప్రాణాలను విడిచారు. ఆయన భార్య లక్ష్మికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అటెండర్‌గా ఉద్యోగం ఇచ్చింది. సోమవారం సన్మాన కార్యక్రమంలో లక్ష్మి ఎమ్మెల్యే శంకర్ కాళ్లు మొక్కగా ఆయన వారించలేదు.

జై బాపు.. జై జగన్

రాష్ట్రావతరణ వేడుకలో ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్

మహబూబాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అవతరణ దిన వేడుకల్లో డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ జై తెలంగాణ.. జై బాబు.. జై భీమ్.. జై జగన్.. జై కాంగ్రెస్.. అంటూ నినదించారు. దీంతో వేదిక పైన ఉన్న కలెక్టర్, ఎస్పీ తదితరులు అవాక్కయ్యారు. వివరాల్లోకి వెళితే.. రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా మానుకోట జిల్లాకు ముఖ్య అతిథిగా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. స్టేజిపైకి వచ్చి పథకాల అమలుపై ప్రసంగం పూర్తయ్యాక జై తెలంగాణ.. జై బాపు.. జై భీమ్.. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. జై జగన్ అనడంతో వేదిక పైన ఉన్న వారితో పాటు ఉద్యోగులు, కళాకారులు, ప్రజలు, పాత్రికేయులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. జై జగన్ అనడం ఏమిటని గుసగుసలాడుకున్నారు.

కాంగ్రెస్ గద్దెపై జాతీయ జెండాను ఎగురవేస్తున్న కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ గద్దెపై జాతీయ జెండా

కురవి, జూన్ 2: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మోద్గులగూడెంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ గద్దెపై అధికార పార్టీ నాయకులు జాతీయ జెండాను ఎగురవేశారు. దేశగౌరవాన్ని సూచించే జాతీయ జెండా ఓ పార్టీ గద్దెపై ఎగురవేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు?

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ప్రసంగంలో సురేఖ తడబాటు

వరంగల్, జూన్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : దేవాదాయ మంత్రి కొండా సురేఖ తీరు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంత్రి సురేఖ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండ జిల్లాకు సంబంధించి పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం జరిగిన ఆవిర్భావ దినోత్సవానికి మంత్రి సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ప్రగతి ప్రసంగం సమయంలో మంత్రి సురేఖ తడబడ్డారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి బదులుగా గణతంత్ర దినోత్సవం అని పలకడంతో అక్కడ ఉన్న వారంతా నవ్వుకున్నారు. సురేఖ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు

అసెంబ్లీ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరించిన స్పీకర్

- శాసనమండలి ప్రాంగణంలో వేడుకల్లో పాల్గొన్న చైర్మన్
- వివిధ పార్టీల రాష్ట్ర కార్యాలయాల్లో రాష్ట్రావతరణ వేడుకలు

హైదరాబాద్, జూన్2 (నమస్తేతెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఘనంగా వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర అసెంబ్లీ, శాసనమండలి ఆవరణలో సోమవారం రాష్ట్రావతరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శాసనమండలి ఆవరణలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ ఆవరణలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రావిర్భావ ఉద్యమ ప్రస్థానాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ నర్సింహాచార్యులు తోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

రాజ్‌భవన్‌లో రాష్ట్రావతరణ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ కార్యాలయాల్లో వేడుకలు

హైదరాబాద్‌లోని కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ రాష్ట్ర కార్యాలయాల్లో సోమవారం తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో ప్రాణత్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని వివరించారు. కార్యక్రమంలోఎంపీ అనిల్‌కుమార్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, అమీర్ అలీఖాన్, బల్మూరి వెంకట్, వర్కింగ్ ప్రెసిడెంట్ గీతారెడ్డి, మాజీ ఎంపీలు అంజన్‌కుమార్ యాదవ్, వీ హనుమంతరావు, డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు నూతిశ్రీకాంత్, మెట్టు సాయికుమార్, అజ్మత్ కొత్వాల్, తహర్‌బీన్ అహ్మదాని తదితరులు పాల్గొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయమైన ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆవిర్భావ వేడుకల్లో ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, పార్టీ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, నాయకులు డాక్టర్ ఏఎస్ రావు, పోలంపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయమైన మగ్దూంభవన్‌లో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్క్ భూమి కాజేసే కుట్ర!

- 142 ఎకరాలను పద్మశాలీల నుంచి లాక్కునేందుకు ప్లాన్
- తమ భూములను అప్పగించాలని బాధితుల ఆందోళన
- ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని వేడుకోలు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ హెటెక్ టెక్స్‌టైల్ పార్క్ భూములను కాజేసేందుకు కుట్ర జరుగుతున్నదని సొసైటీ సభ్యులు ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా చేగూరులో పద్మశాలీలు యూనియన్‌గా ఏర్పడి టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు రైతుల నుంచి 2003లో సేకరించిన 142 ఎకరాల భూములను కాజేసేందుకు సొసైటీ అధ్యక్షుడు, ఐదుగురు డైరెక్టర్లు కుట్ర చేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పట్లో 108 మంది పద్మశాలీలు కలిసి ఒక సొసైటీగా ఏర్పడి, రూ.40 వేల నుంచి రూ.1.2 లక్షల దాకా వెచ్చించి, 142 ఎకరాలను కొనుగోలు చేశామని చెప్పారు. భూములను 108 మందికి షేర్ల రూపంలోకి మార్చిడి చేసి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని భావించినట్టు వెల్లడించారు. కానీ ఈ సొసైటీకి అధ్యక్షుడిగా ఉన్న ఉప్పల నర్సయ్య తమ పేరిట షేర్లు బదలాయించినట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చూపించారని, తమకు మాత్రం రిజిస్ట్రేషన్ చేయించకుండా 20 ఏండ్ల నుంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ వ్యవహారంపై పోలీసు, రెవెన్యూ అధికారులు, కోర్టులకు మొరపెట్టుకున్నా న్యాయం జరగడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ భూములను నగర శివారులో ఉండటంతో ధరలు అమా